కౌలు రైతులకు ఏదీ భరోసా !

- కౌలుదారులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ అమలులో మొండి చేయి
- గత ప్రభుత్వంలో కౌలుదారునికి పెట్టుబడి సాయం అందజేత



రంగంపేట మండలంలో కౌలుకు సాగు చేసిన వరి పంట

రంగంపేట: కౌలు రైతులకు ఈ ఏడాది కూడా కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచే విధంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులను, కౌలుదారులను అన్ని విధాలుగా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు రూ.20 వేలు అందిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి ఏడాది రైతులకు మొండి చేయి చూపించారు. రెండవ ఏడాది షరతులతో రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వాటా రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5 వేలు కలిపి రూ.7వేలు ఇచ్చింది. కౌలు రైతులకు మాత్రం నిధులు కేటాయించలేదు. దీంతో కౌలు రైతులు నిరాశ చెందుతున్నారు.

ఎన్నికల్లో ఊదరగొట్టి.. గెలిచాక పక్కన పెట్టి

ఎన్నికల ముందు కూటమి పార్టీలు సాధ్యం కాని హామీలతో ఊదరకొట్టాయి. అధికారంలోకి వచ్చాక కౌలు రైతులను పట్టించుకోవడం లేదు. అనపర్తి నియోజకవర్గంలో దాదాపు 24,293 సీసీఆర్ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా ఉంది. వ్యవసాయ అధికారులు నేటికి 12,862 కార్డులే మంజూరు చేశారు. దాంతో పాటు రైతులకు ఉచిత పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఏడాది పాటు అందలేదు. రైతులకు గత ప్రభుత్వం ఉచిత బీమాను ప్రవేశ పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత బీమాను రద్దుచేస్తూ రైతులపై ప్రీమియం భారం వేసింది. కౌలు రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కౌలు రైతులకు మాత్రం మొండి చేయి తప్పడంలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకూ భరోసా

2019 అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులతో పాటు కౌలుదారులకు సమానంగా రూ.13,500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో అందించింది. రైతులకు అందించే ప్రతి సంక్షేమాన్ని కౌలు రైతులకు వర్తింపజేస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు. పైగా సరైన సమయంలో ఎరువులు, యూరియా లభించకపోవడంతో రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ఏడాదైనా కౌలు రైతులకు సాయం అందుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కౌలు రైతులకు రూ. 13,500 రైతు భరోసా పథకంలో అందజేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని చెప్పారు. ఈ ఏడాడిపైగా అయినా కనికరించడం లేదు.

– పాలిక నూకరాజు, కౌలు రైతు, మర్రిపూడి, రంగంపేట మండలం

రైతుల బాధలు కనిపించవా?



కౌలుదారులు, రైతులు బాధలు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదు. రైతు తీవ్రంగా నష్టపోతుంటే పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి.

– రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి

అర్హులందరికీ సీసీఆర్ కార్డులు



ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలో ఇంకా ఎలాంటి ఆదేశాలు వెలువడ లేదు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు కౌలు రైతుల ఎంపిక జాబితాను సిద్ధం చేస్తున్నాం. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తున్నాం. కౌలు రైతులకు పెట్టుబడి సాయం అక్టోబరులో అందిస్తారనే సమాచారం ఉంది. దరఖాస్తు చేసుకున్న అర్హులైన కౌలుదారులకు సీసీఆర్ కార్డులను మంజూరు చేస్తున్నాం.

– కె. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి, రంగంపేట మండలం

సూర్య దేవాలయంలో సప్తాహం ప్రారంభం



సూర్యదేవాలయంలో స్వామి సంకీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం

పెదపూడి: జి.మామిడాడ సూర్యదేవాలయంలో త్రయోదశ (13) సప్తాహ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు నడుమ స్థానిక తుల్యభాగ నది నుంచి జలాన్ని తీసుకుని వచ్చి విశ్వక్సేన పూజ చేశారు. సప్తాహ కలశస్థాపన పుణ్యాహవాచనము నిర్వహించారు. బాలాజీ బాల భజన భక్త బృందం సమాజం స్వామివారి సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా పండితులు రేజేటి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ యావత్ భారతదేశంలో వైష్ణవ సంప్రదాయ పద్ధతిలో విరాజిల్లుతున్న ఏకైక ఆలయం జి.మామిడాడలోని సూర్యదేవాలయమన్నారు. సప్తాహాల నిర్వహణతో గ్రామం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉంటుందన్నారు.ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించే సప్తాహాలకు గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆలయ ఈవో పాటి సత్యనారాయణ, సప్తహ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల్లో నిబంధనలు పాటించాలి

పెదపూడి: ఉపాధి హామీ పథకం పనులు నిబంధనల ప్రకారం చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన కూలీలందరికీ పని కల్పించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద తడి చెత్త వేసుకోడానికి కంపోస్ట్ బిట్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని, నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణకు నిర్మించే వాటర్ హార్వెస్టింగ్ కమ్యూనల్స్‌ను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.సత్యనారాయణ, హౌసింగ్ శాఖ అధికార్లు లంక వెంకటేశ్వరరావు, మూర్తి, మురళి, సిబ్బంది రామకష్ణ, శేషగిరి పాల్గొన్నారు.

వంతెనపై ఇరుక్కుపోయిన లోడు లారీ



పందలపాకలో వంతెనపై ఇరుక్కుపోయిన లారీ

బిక్కవోలు: లోడు లారీ అదుపుతప్పి వంతెనపై ఇరుక్కుపోవడంతో శుక్రవారం పందలపాక మసీద్ వద్ద ప్రధాన రహదారిపై కొన్ని గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. కొమరిపాలెం నుంచి పందలపాకలోని ధ్యానం గోడౌన్ వద్దకు లారీ వస్తున్న క్రమంలో వంతెనపై మలుపు తిప్పేటప్పుడు వాహనం అదుపుతప్పి కాలువవైపునకు దూసుకుపోతూ ఒక్కసారిగా ఆగింది. తృటిలో ప్రమాదం తప్పి లారీ వంతెనకు అడ్డుగా నిలిచిపోయింది. సుమారు గంటన్నర వరకు వాహనాల రాకపోకలకు దారి లేకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. కాలువకు అటువైపు ఉన్న ఉన్నత పాఠశాలకు విద్యార్థులు వేరే మార్గంలో వెళ్లారు. దశాబ్దాల కాలం నాటి పాత ఇరుకు వంతెన వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శి సూరిశెట్టి సురేష్ స్పందించి జేసీబీని రప్పించి లారీని వంతెనపై నుంచి పక్కకు తరలించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

విలువిద్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విలువిద్య పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులతో హెచ్ఎం లక్ష్మణ్

సీతానగరం: కాటవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి విలువిద్య పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు పి.లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో గురువారం నిర్వహించిన ఆర్చరీ రికర్వ విభాగంలో అండర్–17లో 8వ తరగతి విద్యార్థి ఎస్.చంటిబాబు, అండర్–14 విభాగంలో 7వ తరగతి విద్యార్థిని ఎన్.భాగ్యలక్ష్మి ప్రసన్న, స్టాండ్ బైలో అండర్–14 విభాగంలో 7వ తరగతి విద్యార్థులు బి.విక్కి, సీహెచ్ ప్రసన్న, 6వ తరగతి విద్యార్థి పి.గణేష్ రాష్ట్రసాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీడీ ఎమ్.కుమారిని, హెచ్ఎం లక్ష్మణ్, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందించారు.

సారా కేసులో ముద్దాయికి రిమాండ్

రంగంపేట: సారా కేసులో ముద్దాయికి రిమాండ్ విధించినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సుధ తెలిపారు. శుక్రవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం సారా కేసులో నిందితుడైన వడిశలేరుకు చెందిన కురుకూరి వెంకటేష్ కొంతకాలంగా పరారీలో ఉన్నాడని అతడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని తెలిపారు. మర్రిపూడికి చెందిన నెల్లి కృష్ణ బైండోవర్ ఉల్లంగించి సారా విక్రయం కొనసాగించడంతో స్థానిక తహసీల్దార్ కోను అనసూయ నిందితుడికి రూ.40 వేలు జరిమానా విధించినట్టు ఎక్సైజ్ శాఖ సీఐ తెలిపారు.

దివ్యాంగులకు చేయూత

బిక్కవోలు: దివ్యాంగులకు చేయూత ఇవ్వటం ద్వారా సమాజంలో వారు ఉన్నతస్థాయికి ఎదగటానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం బలభద్రపురంలోని దివ్యాంగుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం దివ్యాంగులకు అవసరమైన పరికరాలను గుర్తించారు. నియోజకవర్గంలో 42 మంది దివ్యాంగులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, ఎంఈవో సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

సొసైటీల్లో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టండి

అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి : వ్యవసాయ పరపతి సంఘాల్లో కూటమి నేతలు అవినీతికి పాల్పడి అన్నం పెట్టే రైతన్నలకు అన్యాయం చేయవద్దని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హితవు పలికారు. పెదపూడి మండలం పైన గ్రామంలోని వ్యవసాయ పరపతి సంఘంలో రూ.13,30,000 విలువైన యూరియా పక్కదారి పట్టడంపై ఆయన స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి రైతులను మోసగించిన దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి వారి నుంచి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో సొసైటీల్లో భారీగా దోపిడీ జరిగిందని ఆయన ఆరోపించారు. పైన సొసైటీలో జరిగిన ఘటనే దీనికి నిదర్శనమన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన నాయకులు అధికారులు తప్పుడు మార్గంలో యూరియాను పక్కదారి పట్టించడంతోనే కొరత ఏర్పడిందన్నారు. పైనలో యూరియా పక్కదారి పట్టించి ఆ సొమ్మును రైతుల బకాయిగా చూపించి మోసం చేయడం దారుణమైన నేరమన్నారు. సీఈవోపై కఠిన చర్యలు తీసుకుని రైతుల సొమ్ము రికవరీ చేసి సొసైటీకి జమ చేయాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు.

15న 'నన్నయ'లో 'అద్విక 25 టెక్ ఫెస్ట్'



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఈనెల 15న అద్విక 25 టెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్టు వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. ఇంజినీర్స్ డే సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆమె విడుదల చేశారు. విద్యార్థులకు పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, టెక్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్పో, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, స్కిల్ హౌస్ వంటి సాంకేతిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వెంకటేశ్వర్రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

హాస్టల్‌లో పరిశుభ్రత పాటించాలి

రాజానగరం: యూనివర్సిటీ క్యాంపస్‌లోని హాస్టల్స్‌ను సిబ్బందితోపాటు విద్యార్థులు కూడా సొంత ఇంటిలా పరిశుభ్రంగా ఉంచాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. క్యాంపస్‌లోని బాలుర హాస్టల్‌ను శుక్రవారం ఆమె సందర్శించి, వంట గది, విద్యార్థులు భోజనాలు చేసే హాలు, పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణ, సదుపాయాలు, ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బంది, విద్యార్థులకు సూచించారు.

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి



దోమాడ గ్రామ పంచాయతీలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ రవికుమార్

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మరింత మెరుగుపర్చి ప్రజారోగ్యాన్ని పరిరక్షించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ అన్నారు. దోమాడ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలు తడి, పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. తాగునీటి రక్షిత పథకాన్ని సందర్శించి క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేల పురోగతిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. తడి, పొడి చెత్త క్లాప్ మిత్రలకు అందించే విధానంపై ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, సచివాలయం కార్యదర్శి లక్ష్మమ్మ, సర్పంచ్ మీనవల్లి శారదాదేవి, సిబ్బంది వాసంశెట్టి శ్రీనివాసమూర్తి, వెంకట్, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



పురుషోత్తపట్నంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

సీతానగరం: పురుషోత్తపట్నం ప్రభుత్వ స్కూల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. కొన్నేళ్లుగా ఇదే విధంగా ఉంటోందని స్థానికులు మొరపెట్టుకున్నా విద్యుత్‌శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభం నుంచి చేతికందే ఎత్తులో ఉన్న తీగలను సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానం చేశారు. రోడ్డుపై నుంచి వెళ్లేవారికి ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అనే భయాందోళన నెలకొంది. పాఠశాలలకు ఇదే రోడ్డు మీదుగా పిల్లలు వెళుతుంటారు. దేవిపట్నం మండలం నేలకోట తదితర గ్రామాలకు, గోకవరం మండల గ్రామాలకు దగ్గరి మార్గమైన ఈ రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మస్ చేతికి అందేలా ఉండటంతో స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని, దీని చుట్టూ రక్షణగా మెస్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డుకు పక్కనే ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ వలన రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. దీనిపై సంబంధిత విద్యుత్‌శాఖాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

విజయదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకం

పెదపూడి: సంపరలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గమ్మకు ఘనంగా పంచామృతాభిషేకం, పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారికి కంకుమ పూజల చేశారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర పారాయణం చేయించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్–4)గా విధులు నిర్వహిస్తున్న సమయంలో నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై ప్రస్తుతం రాజానగరం మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సీహెచ్ రాణిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పంచాయతీ కార్యదర్శి సీహెచ్ శాంతామణి ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రాణి వెంకటనగరం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహించిన సమయంలో పంచాయతీ నిధుల్లో రూ.34,56,091 దుర్వినియోగం అయినట్టు లభించిన ఆధారాలు, సంబంధిత అధికారుల విచారణ ద్వారా తేలిందన్నారు. నిధుల దుర్వినియోగం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్, 1991లోని రూల్ 8 (1) ప్రకారం సీహెచ్ రాణిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి సీహెచ్ శాంతామణి తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సీహెచ్ రాణి ప్రధాన కార్యాలయం సీతారాంపురం గ్రామ పంచాయతీగానే నిర్ణయించినట్టు తెలిపారు. అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయం వదిలి వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశామన్నారు. రాజానగరం ఎంపీడీవోకు సీహెచ్ రాణి సస్పెన్షన్ ఆర్డర్ అందజేయడం, ప్రత్యామ్నాయ ఇన్‌చార్జి నియామకం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

కాలువను తలపిస్తున్న హైస్కూల్ రహదారి



అనపర్తి బాలికల హైస్కూల్ రహదారిలో వర్షం నీరు

అనపర్తి : చిన్నపాటి వర్షానికే పెద్ద కాలువను తలపిస్తోంది అనపర్తిలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ రోడ్డు. శుక్రవారం ఉదయం నుంచి చినుకులు కురవడంతో ఈ రోడ్డుపై నీరు నిలిచిపోయి పాఠశాలకు వెళ్లే విద్యార్థినులు, వాహనచోదకులు అవస్థలు పడ్డారు. ఈ రోడ్డులో మ్యాన్‌హోల్, స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో వాహనచోదకులు కిందపడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎప్పుడో నిర్మించిన డ్రెయినేజీలు సామర్థ్యం సరిపోక నీరు నిలిచిపోయి ఆలస్యంగా బయటకు వెళుతోంది. వర్షం వచ్చిన సమయంలో పక్కనే ఉన్న సామర్లకోట కెనాల్ నీరు ఎగదన్నడంతో రోజంతా నీరు రోడ్డుపై నిలిచిపోవడమే కాకుండా హైస్కూల్ గ్రౌండ్‌లోకి వచ్చేసి రోజుల తరబడి నిలువ ఉండి దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ వీధిలో డ్రెయినేజీని ఎత్తు, వెడల్పు పెంచితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు అంటున్నారు.

రూ.4 కోట్లతో వలస పక్షుల సంరక్షణ కేంద్రం



కార్యాచరణ పటాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల తదితరులు

రాజానగరం: మండలంలోని పుణ్యక్షేత్రంలో వలస పక్షుల కోసం రూ. 4 కోట్ల వ్యయంతో సంరక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. అటవీ శాఖ అధికారులతో ఆ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో వలస పక్షుల సంరక్షణ కోసం చేపట్టవలసిన చర్యలపై ఆయన చర్చించారు. విదేశాల నుంచి ఏటా క్రమం తప్పకుండా వచ్చే పక్షులను స్థానికులు తమ ఇంటి ఆడపడచుల్లా ఆదరిస్తారన్నారు. పక్షులకు ఆవాసంగా ఉన్న ఊరచెరువు చుట్టూ అభివృద్ధి చేసి, సందర్శకుల కోసం వాచ్ టవర్లు, చిల్డ్రన్స్ ప్లే జోన్లు, పక్షుల ఆవాసాల కోసం ప్రత్యేక నిర్మాణాలు వంటి సదుపాయాలు కల్పించి, ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ పటాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం. వెంకటేశ్వర్రావు, జిల్లా అటవీ శాఖ అధికారి వి. ప్రభాకరరావు, రాజమండ్రి ఫారెస్టు రేంజర్ డేవిడ్ రాజు, డిప్యూటీ రేంజర్ పద్మావతి దేవి, తహసీల్దారు జీఎల్ఎస్ దేవి, ఎంపీడీఓ జేఏ ఝూన్సీ, ఈఓపీఆర్డీ వై. వాణి, విద్యుత్, వెటర్నరీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఫిషరీస్, వైద్య శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని, పీపీపీ లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో 17 కొత్త వైద్య కళాశాలలలో పదింటిని పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించడం ఆందోళనకరమన్నారు. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలను 33 సంవత్సరాల లీజుకు ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం ద్వారా 1,500 ఎంబీబీఎస్ సీట్లు ప్రభావితమవుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కోటాను 50 శాతం తగ్గించి, 50 శాతం సీట్లను మార్కెట్ రేట్లతో విక్రయించడం వల్ల ఫీజులు అమాంతం పెరుగుతాయన్నారు. జగన్ ప్రభుత్వం నాబార్డ్ నిధులతో రూ.8,500 కోట్లతో 17 కళాశాలల నిర్మాణానికి చొరవ తీసుకుందని, 2023లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో 5 కళాశాలలు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. 80 శాతం నిర్మాణం పూర్తయిన 10 కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను రద్దు చేయమని ఎన్ఎంసీకి కూటమి ప్రభుత్వం లేఖ రాసిందన్నారు. ఇది పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం పారదర్శకత లేకుండా, కన్సల్టెన్సీల ద్వారా వైద్య కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందన్నారు. చిత్తూరులో ప్రైవేటు సంస్థ ప్రభుత్వ ఆసుపత్రిని వినియోగిస్తూ కొత్త భవనాలు నిర్మించకుండా అధిక ఫీజులతో అరకొర వైద్యం అందడం సామాన్యులకు నష్టం కలిగిస్తోందన్నారు. అన్ని ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



సైబర్ నేరాలపై మాట్లాడుతున్న అయ్యప్పరెడ్డి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఇటీవల ఆన్‌లైన్ మోసాలు విస్తృతంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా యువతను, రిటైర్డ్ ఉద్యోగులను, ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని మోసగాళ్లు వివిధ రకాలుగా మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.అయ్యప్పరెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ డి.నరసింహా కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీస్ నెట్వర్క్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు సైబర్ నేరాలపై శుక్రవారం స్థానిక ఇన్నీసుపేట రజక కల్యాణ మండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా యూపీఐ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ కస్టమర్ కాల్స్, ఓటీపీ షేరింగ్ మోసాలు వంటి అంశాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫేక్ జాబ్ ఆఫర్లు, లోన్ యాప్‌లు, డిస్కౌంట్ స్కామ్‌లు, ఏటీఎం కార్డ్ క్లోనింగ్ వంటివాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని, ఇంటర్నెట్‌ను సమాచార సాధనంగా మాత్రమే వాడాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ బ్యాంక్ వివరాలు, ఓటీపీ పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైం.గవ్.ఇన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సైబర్ సిబ్బంది వైవీ సురేష్, అబ్దుల్ షౌకత్, సుమారు 200 మంది మైక్రో ఫైనాన్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.